# కులవృత్తులకు గౌరవం

▪ సీఎం కేసీఆర్ హయాంలో దక్కిన ఆత్మగౌరవం ▪ అన్ని కులసంఘాలకు కమ్యూనిటీహాళ్లు ▪ ప్రతి కార్యకర్త బీఆర్ఎస్ పార్టీ కోసం పనిచేయాలి : క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ▪ 200 మంది లబ్ధిదారులకు బీసీ బంధు చెక్కుల పంపిణీ



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న బీజేపీ నాయకులు


మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 8 : కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకే సీఎం కేసీఆర్ బీసీబంధు పథకానికి శ్రీకారం చుట్టారని ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లోని శిల్పారామంలో వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో 200మంది లబ్ధిదారులకు రూ.లక్ష చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టామన్నారు. రైతులు, పేద ఆడపిల్లలు, వృద్ధులు, వికలాంగులను దృష్టిలో ఉంచుకొని రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు వంటి ఎన్నో పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. తమ ప్రభుత్వ హయాంలోనే కులవృత్తులకు గౌరవం దక్కిందని, అన్ని కులసంఘాలకు హైదరాబాద్, మహబూబ్‌నగర్‌లో ఆత్మగౌరవ భవనాలు, కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ వెంకన్న, గ్రంథలయాల సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రెహమాన్, డీసీసీబీ, మున్సిపల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్లు వెంకటయ్య, గణేశ్, గిరిధర్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, రాజేశ్వర్, ఎంపీపీ సుధాశ్రీ, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధికి ఆకర్షితులై..**

అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై గులాబీ పార్టీలో చేరుతున్నారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరన్నపేటకు చెందిన బీజేపీ పట్టణ వైస్ ప్రెసిడెంట్ అచ్చుగట్ల అంజయ్య, కోశాధికారి శివకుమార్, బీజేవైఎం నాయకులు మహేశ్, అజయ్, విజయ్ సహా 50మంది, బండమీదిపల్లి యాదవసంఘం అధ్యక్షుడు జంగయ్య ఆధ్వర్యంలో బీజేపీకి చెందిన 50మంది బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రైతుబంధు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, గౌరెకాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతన్నయాదవ్, శివరాజ్, రాములు, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

**మంత్రికి మద్దతు..**

అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అఖండ విజయం సాధించాలని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ మహబూబ్‌నగర్ శాఖ పూర్తి మద్దతు ప్రకటించింది. మహబూబ్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసి తమ యూనియన్ తరఫున మద్దతు పత్రాన్ని అందజేశారు. ఉద్యోగుల కోసం నిరంతరం శ్రమిస్తున్న మంత్రికి అండగా ఉంటామని సంఘం నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాలస్వామి, ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి మద్దతు పత్రాన్ని అందజేస్తున్న సీపీఎస్ యూనియన్ నాయకులు

**అన్ని వర్గాలు సంతోషంగా ఉండాలి**

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబర్ 8 : అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి అన్నారు. జిల్లాకేంద్రంలోని గౌతమబుద్ధనగర్‌లో దేవాంగకుల కమ్యూనిటీ హాల్, బిల్డింగ్ పెయింటర్స్ అసోసియేషన్ భవన నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాలమూరును కులమతాలకు అతీతంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. పని చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ వెంకన్న, కౌన్సిలర్ రాణి, నాయకులు శ్రీహరి, వెంకటేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**సెంట్రల్ లైటింగ్ ప్రారంభం**

జిల్లా కేంద్రంలోని పిస్తా హౌస్ నుంచి ఎదిర ఎక్స్‌రోడ్డు వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. మహబూబ్‌నగర్‌ను సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

**ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి**

పాలమూరు, అక్టోబర్ 8 : దసరా ఉత్సవాలను గతానికి మించి నిర్వహించాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని దయానంద విద్యామందిరంలో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దసరా ఉత్సవ కమిటీ సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలోనే ఎక్కడా లేని విధంగా ధ్వజ దారి కార్యక్రమాన్ని పాలమూరులో నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవ ఊరేగింపు అత్యంత అద్భుతంగా ఉంటుందని, ఈ ఏడాది ఊరేగింపులో పటాకుల మోత, స్వాగత తోరణాలు, కళాజాత, కళాకారుల కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. అత్యధిక సంఖ్యలో ప్రజలను భాగస్వామ్యం చేసి దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇకపై నిర్వహించే అన్ని కార్యక్రమాలను ట్యాంక్‌బండ్‌పై నిర్వహిస్తే బాగుంటుందని, ముఖ్యంగా బతుకమ్మ ఘాట్, శిల్పారామం, ఐలాండ్ అందుబాటులో ఉన్నాయని వీటిని వినియోగించుకునేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. పండుగలోపే 20 ఫీట్ల ఎత్తయిన జమ్మి వృక్షాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవాల నిర్వహణకు సహాయం చేస్తానని మంత్రి తెలిపారు. ఈ ఏడాది ధ్వజధారిగా కుమార స్వామిని మంత్రి సమక్షంలో కమిటీ నిర్ణయించింది. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా చైర్మన్ వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేశ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ముత్యాల ప్రకాశ్, డా.మురళీధర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

**దేవుడికి ప్రతిరూపం డాక్టర్లు**

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, అక్టోబర్ 8 : వైద్యులు దేవుడికి ప్రతిరూపమని మంత్రి పేర్కొన్నారు. ఆదివారం అప్పన్నపల్లి సమీపంలో రూ.50లక్షలతో నిర్మించనున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డాక్టర్లకు సగం జీవితం చదవడానికి, మిగిలిన జీవితంలో మానసిక ఒత్తిడి, ఆందోళనతో గడుపుతూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తారన్నారు. అంత పవిత్రమైన వృత్తిలో కొనసాగుతున్న వారికి చేయూతనివ్వాలనే ఉద్దేశంతో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, గైనకాలజీ సొసైటీ భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో మహబూబ్‌నగర్‌ను వైద్యపరంగా అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. మెట్రో రైల్ సౌకర్యాన్ని సైతం పాలమూరుకు తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, డాక్టర్లు సంపత్, శామ్యూల్, వెంకటరామిరెడ్డి, ప్రతిభ, విజయ్‌కాంత్, రజనీకాంత్, బాల శ్రీనివాస్, రాఘవేందర్, అనుసూయరెడ్డి, అపర్ణ, విష్ణు ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు అండగా నిలవాలి

▪ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

పెద్దమందడి, అక్టోబర్ 8 : ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకూ పార్టీ అండగా ఉంటుందని మంత్రి అన్నారు. మండలంలోని గట్లఖానాపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కురుమూర్తి, మేస్త్రీ రాజుతోపాటు పలువురు కార్యకర్తలు హైదరాబాద్‌లో సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరామన్నారు. మండలాన్ని అభివృద్ధి చేస్తున్న మంత్రి గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గోపిందాస్ హనుమంతు, మండల నాయకులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న గట్లఖానాపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

## సుస్థిర పాలనతో మరింత అభివృద్ధి

- అంగన్‌వాడీల ఆత్మగౌరవం పెంచింది సీఎం కేసీఆరే..
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు
- 400 అంగన్‌వాడీలకు టేబుళ్లు, కుర్చీలు అందజేత



అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట, అక్టోబర్ 8 : సుస్థిర ప్రభుత్వం, సుస్థిర పాలనతో రాష్ట్రాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని 400 అంగన్‌వాడీ కేంద్రాలకు టేబుల్, నాలుగు కుర్చీల చొప్పున పంపిణీ చేశారు. కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులకు సౌకర్యవంతంగా ఉండేందుకు గువ్వల సొంత ఖర్చులతో వీటిని అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, మినీ టీచర్లు, ఆయాల ఆత్మగౌరవాన్ని తెలంగాణ ప్రభుత్వమే పెంచిందన్నారు. వేతనాలు పెంచి వారి బాగోగులు పట్టించుకున్న ఏకైక సీఎం కేసీఆరేనని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు అంగన్‌వాడీలను కనీసం గుర్తించలేదని గుర్తు చేశారు. కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించి పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలకు చర్యలు చేపట్టిందన్నారు. తెలంగాణలోని అంగన్‌వాడీలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. జీతభత్యాలు పెంచి అండగా నిలిచిన సీఎం కేసీఆర్‌కు అంగన్‌వాడీలు అండగా నిలవాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీల సమస్యలు, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ అరుణ, మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, జెడ్పీటీసీ రాంబాబు, సీడీపీవోలు దమయంతి, లక్ష్మి, కౌన్సిలర్లు, సూపర్‌వైజర్లు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలోనే బ్రహ్మాండమైన అభివృద్ధి

- జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి
- చర్లపల్లిలో డబుల్‌బెడ్రూం ఇండ్ల ప్రారంభం
- బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు



లబ్ధిదారుకు డబుల్‌బెడ్రూం పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్, అక్టోబర్ 8 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం బ్రహ్మాండమైన అభివృద్ధి సాధించిందని జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని స్పష్టం చేశారు. జడ్చర్ల మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. గంగాపూర్‌లో రైతువేదిక భవనం, సెంట్రల్ లైటింగ్, తాగునీటి ట్యాంకును ప్రారంభించారు. బోవెలకుంటలో రూ.1.20కోట్లతో బీటీ రోడ్డ పనులకు శంకుస్థాపన చేశారు. చర్లపల్లిలో రూ.1.40కోట్లతో నిర్మించిన 24 డబుల్ బెడ్రూం ఇండ్లకు సంబంధించిన అపార్ట్‌మెంట్‌ను ప్రారంభించి లబ్ధిదారులకు పట్టాలు, దసరా కానుకగా మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. అదేవిధంగా ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. బూర్గుపల్లిలో 33 కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించి పెద్ద తండాలో అండర్ డ్రైనేజీ, సీసీ, బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. మల్లెబోయిన్‌పల్లిలో రైతువేదిక భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. అనంతరం గోప్లాపూర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుర్రాల నర్సింహులు, మల్లెపోగు యాదయ్య, శివ ఆధ్వర్యంలో 30మంది కార్యకర్తలు జడ్చర్లలోని ఎమ్మెల్యే స్వగృహంలో బీఆర్ఎస్‌లో చేరారు. అదేవిధంగా బాలానగర్ మండలం వీరన్నపల్లికి చెందిన 50మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ యాదయ్య, మార్కెట్‌కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ సుదర్శన్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, తాసిల్దార్ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ రాజ్‌కుమార్, ఆయా గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.